సాక్షి
అనంతపురం
సోమవారం ౹ 25 ౹ నవంబర్ ౹ 2024



టమాట కిలో రూ.26

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.26 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



పంపనూరు.. భక్తజన హోరు

పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులతో సందడి నెలకొంది.

8లో

గరిష్టం/కనిష్టం
34.2°/ 14.6°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి వాతావరణం నెలకొంది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు 'దుర్గం'లో
ప్రజాసమస్యల పరిష్కార వేదిక

అనంతపురం అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక జిల్లాస్థాయి కార్యక్రమాన్ని సోమవారం కళ్యాణదుర్గంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఆర్‌డీటీ ఎకాలజీ సెంటర్‌లో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. తనతో పాటు జాయింట్ కలెక్టర్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. కళ్యాణదుర్గం డివిజన్ స్థాయిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పక్కాగా ఓటరు జాబితా సవరణ



అధికారులకు సూచనలిస్తున్న ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు

అనంతపురం అర్బన్: ఓటరు జాబితా సవరణను పక్కాగా నిర్వహించాలని సీఈఓ కార్యాలయ ప్రత్యేక అధికారి జి.వెంకటేశ్వర్లు ఎన్నికల అధికారులు, బీఎల్‌ఓలను ఆదేశించారు. ఓటు నమోదు, తొలగింపు, వివరాల మార్పునకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించారు. అనంతపురం అర్బన్, గుంతకల్లు, పామిడి, గుత్తి మండలాల్లోని పోలింగ్ బూత్‌లను ప్రత్యేక అధికారి సందర్శించి సవరణ తీరును పరిశీలించారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు. 2025, జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన, నిండనున్న యువతను ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అనంతపురం అర్బన్ తహసీల్దారు హరికుమార్, పామిడి తహసీల్దారు శ్రీధర్ మూర్తి, ఎన్నికల విభాగం టెక్నికల్ అసిస్టెంట్ శివ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి డిగ్రీ పరీక్షలు



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలతో పాటు మెగా సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు మొత్తం 7,919 మంది, సప్లిమెంటరీ పరీక్షలు 5,898 మంది రాయనున్నారు. ఐదో సెమిస్టర్‌లో రెగ్యులర్ 6,499 మంది, సప్లిమెంటరీకి 2,637 మంది దరఖాస్తు చేశారు. మెగా సప్లిమెంటరీ పరీక్షలకు మూడో సెమిస్టర్ 998 మంది, ఐదో సెమిస్టర్‌కు 979 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో మొత్తం 56 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం 56 మంది అబ్జర్వర్లను ఏర్పాటు చేశారు.

డ్రైవర్ల అవగాహన రాహిత్యంతోనే ఘోరం

గార్లదిన్నె: ఆర్టీసీ, ఆటో డ్రైవర్ల అవగాహన రాహిత్యంతోనే తలగాచిపల్లి క్రాస్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నట్లు డీటీసీ వీర్రాజు తెలిపారు. శనివారం మండల పరిధిలోని తలగాచిపల్లి క్రాస్ వద్ద ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొని ఎనిమిది మంది కూలీలు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం ఘటనాస్థలాన్ని కళ్యాణదుర్గం ఆర్టీఓ రమేష్, ఎంవీఐ సునీత, డీఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి డీటీసీ వీర్రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. తలగాచిపల్లి క్రాస్‌లో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు అరిగిపోయాయని, త్వరలో వాటి ఎత్తు పెంచి, పెయింటింగ్ వేస్తామని పేర్కొన్నారు.

బాధాకరం..

ఘోర రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది వ్యవసాయ కూలీలు చనిపోవడం బాధాకరమని మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం నుంచి గుంతకల్లు వెళ్తూ మార్గమధ్యంలో తలగాచిపల్లి క్రాస్‌లో ప్రమాద స్థలాన్ని ఆమె పరిశీలించారు. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జాతీయ రహదారులపై ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి, రోడ్డు నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులకు సూచించారు.

పచ్చ గద్దలున్నాయ్ జాగ్రత్త!



అనంతపురం ఆర్టీఓ కార్యాలయం సమీపాన టీడీపీ నాయకులు కబ్జాకు యత్నించిన స్థలం

- అనంతపురం ఆర్టీఓ కార్యాలయం సమీపంలోని సర్వే నం.315లో ఎకరా భూమి 40 ఏళ్లుగా కొందరి పేరుపై ఉంది. ఇటీవల టీడీపీ నాయకులు ఉన్నపళంగా ఈ భూమిలోకి ప్రవేశించారు. సర్వే అంటూ సుమారు 30 మంది హల్‌చల్ చేశారు. ఆక్రమించేందుకే చొరబడ్డారని, స్థానిక టీడీపీ నాయకుడు సుధాకర్ యాదవ్ వీరి వెనుక ఉన్నారని బాధితులు చెబుతున్నారు. వన్‌టౌన్ సీఐ దగ్గరుండి సర్వే చేయించడానికి యత్నించారంటూ వారు వాపోయారు.

- అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి సర్వే నం.133/1, 134లోని 4 సెంట్ల ఖరీదైన స్థలాన్ని వారం క్రితం చక్రపాణి నాయుడు అనే వ్యక్తి ఆక్రమించడానికి యత్నించాడు. పరిటాల శ్రీరామ్, బాలకృష్ణకు బాగా కావాల్సిన వ్యక్తినని చెప్పుకుంటూ హంగామా చేశాడు. బాధితులు పోలీసుల్ని ఆశ్రయించారు.

- అనంతపురం న్యూ రెవెన్యూ కాలనీలో ఓ ఆర్థోపెడిక్ డాక్టర్ ఇంటి నిర్మాణం చేపట్టగా.. కొంత మంది టీడీపీ నేతలు పనులు ఆపాలని ఆయన్ను బెదిరించారు. ఆ స్థలంలో నిర్మాణం చేపట్టకూడదంటూ వార్నింగ్ ఇచ్చారు. బాధిత డాక్టరు ఎస్పీకి ఫిర్యాదు చేస్తాననడంతో వెనక్కు తగ్గారు.

- ఖాళీ స్థలం కనిపిస్తే చాలు వాలిపోతున్న 'తమ్ముళ్లు'
- డబ్బులివ్వకుంటే పనులు సాగినివ్వబోమంటూ బెదిరింపులు
- రిజిస్ట్రేషన్ చేయకూడదని అధికారులకు ఆదేశాలు
- సహకరిస్తున్న కొంతమంది ఖాకీలు
- వెంచర్లు వేయాలంటే భయపడుతున్న రియల్టర్లు
- జిల్లాలో కొనుగోళ్లు, అమ్మకాలు నిల్

20 శాతం కమీషన్ ఇస్తేనే..



అనంతపురం నగరంతో పాటు రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఎలాంటి లావాదేవీలు జరిగినా వెంటనే రాప్తాడు టీడీపీ నేతలకు సమాచారం వెళుతోంది. ఈ క్రమంలో వారు సబ్‌రిజిస్ట్రార్‌కు ఫోన్ చేసి తాము చెప్పేవరకూ రిజిస్ట్రేషన్ చేయకూడదంటూ ఆదేశాలిస్తున్నారు. దీంతో సదరు నేతతో మాట్లాడుకోండి అంటూ సబ్‌రిజిస్ట్రార్లు చెబుతున్నారు. అక్కడికెళితే ప్లాట్‌కయ్యే ఖర్చులో 20 శాతం కమీషన్ అడుగుతుండటంతో ఎక్కడా కొత్త వెంచర్లు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలకు ఎవరూ ముందుకు రావడం లేదు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో లావాదేవీలు పూర్తిగా స్తంభించిపోయినట్టు తెలిసింది.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఖాళీ స్థలం కనపడితే చాలు టీడీపీ నేతలు గద్దల్లా వాలిపోతున్నారు. వీరి దెబ్బకు జిల్లాలో స్థిరాస్తి రంగం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. గడిచిన నలభై ఏళ్ల చరిత్రలో ఇంత అధ్వానంగా ఎప్పుడూ లేదని స్థిరాస్తి రంగ నిపుణులు అంటున్నారు. ఎన్నికల అనంతరం పరిస్థితులే దీనికి కారణమని చెబుతున్నారు. గతంలో అనంతపురం నగరం చుట్టూ 20 కిలోమీటర్ల పరిధి వరకూ స్థిరాస్తి వ్యాపారాలు బాగా జరిగాయి. కూటమి సర్కారు వచ్చాక ఈ రంగం చతికిలపడటంతో ఆ ప్రభావం మిగతా రంగాలపైనా పడింది. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి యథేచ్ఛగా జరుగుతున్న దాడులు, దౌర్జన్యాల నేపథ్యంలో కొత్తగా వెంచర్లు వేయడానికి ఎవరూ సాహసించడం లేదు. రూ. కోట్లలో పెట్టుబడులు పెట్టి కూడా ఇబ్బంది పడటం దేనికన్న భావన రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో నెలకొంది.

అనంతపురం రూరల్.. హడల్

అనంతపురం రూరల్ మండలం మొత్తం రాప్తాడు నియోజకవర్గంలో ఉంటుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం ఈ ప్రాంతంలో బాగా విస్తరించి ఉంది. గతేడాది జనవరి వరకూ అనంతపురం రూరల్ మండలం మొదలు హంపాపురం వరకూ లే ఔట్లు వేసేవారు, ప్లాట్‌లు కొనేవారు కూడా ఉండేవారు. బాగా క్రయ విక్రయాలు జరిగేవి. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్తే అక్కడ టీడీపీ నేతలు గద్దల్లా వాలిపోతుండటంతో పెట్టుబడి దారులు ఆందోళనకు గురవుతున్నారు. డబ్బు ఇవ్వకపోతే ఎక్కడికక్కడ పనులు ఆపేస్తున్నారు. గతంలో వేసిన వెంచర్లలో ఉన్న కొన్ని ప్లాట్లు అమ్ముదామన్నా కూడా ఎవరూ ముందుకు రావడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు.

విద్యార్థులను ఇబ్బంది పెడితే చర్యలు

- విద్యాసంస్థల యాజమాన్యాలకు కలెక్టర్ హెచ్చరిక



కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఫీజు విషయంలో విద్యార్థులను ఇబ్బంది పెడితే ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని డిగ్రీ, ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఫీజు చెల్లించలేదంటూ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం, పరీక్షలు రాయనీయకుండా ఇబ్బంది పెడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య కారణంగా ఏ ఒక్క విద్యార్థికీ హాల్ టికెట్ ఇవ్వకపోవడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు అనుమతించకపోవడం సరికాదన్నారు. అలాంటి చర్యలకు పాల్పడే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లను నిలుపుదల చేయకూడదని ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే విద్యాసంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. విద్యార్థుల ఫీజులను కళాశాలల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం జీవో ఇచ్చిందని, ఈ విషయాన్ని గుర్తించాలని సూచించారు.

జింక చర్మాల అక్రమ రవాణా ముఠా అరెస్ట్

- 24 జింక చర్మాలు, రెండు కొమ్ములు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న జింక చర్మాలు, కొమ్ములను చూపుతున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు

వజ్రకరూరు: అనంతపురం, కర్నూలు జిల్లాల్లో జింకలను వేటాడి చంపి.. వాటి మాంసాన్ని విక్రయించడంతో పాటు చర్మాలను అక్రమ రవాణా చేస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను వజ్రకరూరు పోలీసులు అరెస్టు చేశారు. ముఠా నుంచి 24 జింక చర్మాలు, రెండు కొమ్ములు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం వజ్రకరూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ నాగస్వామి..ఫారెస్ట్ సెక్షన్ అధికారి కరీముల్లా, బీట్ ఆఫీసర్ సతీష్‌తో కలసి వివరాలు వెల్లడించారు. గుంతకల్లు పట్టణానికి చెందిన షికారి దేవరాజు, షికారి గోవిందు, అనంతపురం నగరానికి చెందిన షికారి బాబు, షికారి బాలరాజు, గుంతకల్లు మండలం ఆచారమ్మ కొట్టాలకు చెందిన వడ్డే పెద్దఅంజి గుంతకల్లు, వజ్రకరూరు, ఆలూరు, చిప్పగిరి తదితర ప్రాంతాల్లో వ్యవసాయ పొలాల్లో ఉచ్చులు ఏర్పాటు చేసి జింకలను వేటాడేవారు. వాటి మాంసాన్ని విక్రయించడంతో పాటు చర్మాలను కర్ణాటకలోని బళ్లారి, కంప్లి, హొస్పేట్ తదితర ప్రాంతాలకు అక్రమ రవాణా చేసేవారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 24 జింక చర్మాలు, రెండు కొమ్ములను సంచుల్లో వేసుకుని కర్ణాటక వైపు వెళుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అటవీ శాఖ అధికారులతో కలసి వజ్రకరూరు మండలం కొనకొండ్ల సమీపంలోని బళ్లారి జాతీయ రహదారిలో వారిని పట్టుకున్నారు. నిందితులను ఆదివారం అనంతపురంలోని మొబైల్ కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించారు.

ప్రాణాలు పోతున్నా పట్టదా..?



పరిమితికి మించి వెళ్తున్న వాహనం నుంచి ప్రయాణికులను కిందకు దింపుతున్న పోలీసులు

తాడిపత్రి టౌన్: ప్రమాదమని తెలిసినా.. పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయడంలో వాహనదారులు పోటీ పడుతూనే ఉన్నారు. శింగనమల నియోజకవర్గం గార్లదిన్నె వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఎనిమిది మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాడిపత్రి పోలీసులు అప్రమత్తమై ఆదివారం సాయంత్రం యల్లనూరు రోడ్డు సర్కిల్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న రెండు ఆటోలు, రెండు బొలెరోలను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి వాహనాలను ఆర్టీఓకు అప్పగించారు. పరిమితికి మించి వాహన ప్రయాణం చేస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రయాణికులను పోలీసులు హెచ్చరించారు.

ముగిసిన సత్యసాయి జయంతి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి

ప్రశాంతి నిలయం: పుట్టపర్తిలో ఈ నెల 18న ప్రారంభమైన సత్యసాయి 99వ జయంతి వేడుకలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. ఏడు రోజులపాటు సాగిన మహా నారాయణ సేవలో భాగంగా దాదాపు 900 మంది సత్యసాయి సేవాదళ్ సభ్యులు 3.60 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ద్వారా నిర్వహించిన మెడికల్ క్యాంపులో 12,500 మందికి వైద్య సేవలందించారు. వేడుకలను విజయవంతం చేసిన భక్తులు, సత్యసాయి సేవాదళ్, ప్రభుత్వ అధికారులు అందరికీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్‌రాజు ధన్యవాదాలు తెలిపారు. రాబోవు శతజయంతి వేడుకలను మరింత విజయవంతం చేసేందుకు చక్కటి ప్రణాళికలతో ముందుకు సాగుతామని చెప్పారు. ఇదిలా ఉండగా వేడుకలు ముగియడంతో దేశ విదేశాలకు చెందిన సత్యసాయి భక్తులు తమ స్వస్థలాలకు బయల్దేరారు.

పలురైళ్లకు కొత్త నంబర్ల కేటాయింపు

హిందూపురం: గుంతకల్లు రైల్వే డివిజన్ గుండా ప్రయాణించే పలురైళ్లకు రైల్వే శాఖ కొత్త నంబర్లు కేటాయించింది. ఈ కొత్త నంబర్లతో రైళ్లు జనవరి ఒకటో తేదీ నుంచి ప్రయాణిస్తాయని డివిజన్ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హిందూపురం-గుంతకల్లు రైలు (నంబర్ 77213), హిందూపురం-గుంతకల్లు (77214), గుంతకల్లు-డోన్ (77203), డోన్-గుత్తి (77207), గుత్తి-డోన్ (77206), గుంతకల్లు-రాయచూరు (77201), రాయచూరు-గుంతకల్లు (77202), తిరుపతి-హుబ్లీ (57401), హుబ్లీ-తిరుపతి (57402), తిరుపతి- కదిరిదేవరపల్లి (57405), కదిరిదేవరపల్లి- తిరుపతి (57406), గుంతకల్లు-తిరుపతి (57404), తిరుపతి - గుంతకల్లు (57403), చిక్‌జాజూర్-గుంతకల్లు (57416), గుంతకల్లు-చిక్‌జాజూర్ (57415), కాచిగూడ -గుంతకల్లు (57412), గుంతకల్లు-బోదన్ (57411) రైళ్లకు కొత్త నంబర్లను కేటాయించినట్లు వెల్లడించారు.

బరువెక్కిన గుండెతో తుది వీడ్కోలు



తల్లిదండ్రుల మృతదేహాలపై మట్టి వేస్తున్న కుమార్తె స్పందన



శ్మశాన వాటిక వద్ద సొమ్మసిల్లిన డి.నాగమ్మ కుమార్తెను తీసుకెళ్తున్న గ్రామస్తులు



జయరాముడు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత ఆలూరు సాంబశివారెడ్డి, సమన్వయకర్త వీరాంజనేయులు, నాయకులు

పుట్లూరు: 'దేవుడా మమ్మల్ని అనాథలను చేశావు కదయ్యా... అమ్మానాన్నలు లేకుండా ఎలా బతకాలి' అంటూ ఆ పిల్లలు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. 'స్వామీ.. ఇక నాకు దిక్కెవరయ్యా' అంటూ ఓ ఇల్లాలు గుండెలవిసేలా విలపిస్తుంటే ఆమెను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. గార్లదిన్నె మండలం తలగాచిపల్లి క్రాస్ వద్ద శనివారం ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో మృతి చెందిన ఎనిమిది మంది అంత్యక్రియలు ఆదివారం పుట్లూరు మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో నిర్వహించారు. మృతదేహాలను శ్మశాన వాటికకు తీసుకెళ్తున్న సమయంలో కుటుంబసభ్యులు, బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి. నిత్యం తమ మధ్య ఉన్న వారు మరణించడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోయారు. మృతులతో తమ అనుబంధం గుర్తుచేసుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు. అశ్రునయనాలతో తుది వీడ్కోలు పలికారు.

పరామర్శించిన వైఎస్సార్‌సీపీ నేతలు..

వైఎస్సార్‌సీపీ నేత ఆలూరు సాంబశివారెడ్డి, పార్టీ శింగనమల సమన్వయకర్త వీరాంజనేయులు, ఎంపీపీ రాఘవరెడ్డి తదితరులు ఎనిమిది మంది మృతదేహాలకు నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. అంత్యక్రియల కోసం రూ.10 వేల చొప్పున అందజేశారు. బాధపడరాదని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

- మృతుల కుటుంబాలను ఎమ్మెల్యేలు బండారు శ్రావణి, ఎంఎస్ రాజు, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. తగిన విధంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

క్షతగాత్రులకు ఉచితంగా వైద్యం

అనంతపురం మెడికల్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులకు ఉచితంగా వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నట్లు మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. నగరంలోని కిమ్స్-సవీరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐదుగురిని ఆదివారం మంత్రి పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ ప్రమాదం విషయం తెలియగానే మృతులు ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించామన్నారు. కలెక్టర్ వినోద్ కుమార్ క్షతగాత్రులను కిమ్స్-సవీరకు తరలించి మెరుగైన వైద్యం అందించేలా చూడటంతో ప్రాణాలు నిలబడ్డాయన్నారు. బాధిత పిల్లల చదువులకు సాయం అందించడంతో పాటు, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రమాదాల కట్టడికి చర్యలు తీసుకుంటామని, ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

- క్షతగాత్రులను మంత్రి టీజీ భరత్ కూడా పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

కుటుంబంలో ఒకరికి ఉద్యోగం

- మంత్రి పయ్యావుల కేశవ్



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

మృతుల కుటుంబంలో ఒకరికి అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశాన్ని కల్పించి ఆదుకుంటామని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగన్న, నాగమ్మ, కొండమ్మ, ఈశ్వరయ్య, బాల పెద్దయ్య, రామాంజినమ్మ, నాగమ్మ, జయరాముడు కుటుంబాలకు ఆదివారం రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వ సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో ఎనిమిది మంది మరణించడం బాధాకరమన్నారు. ఎంత చేసినా కష్టాన్ని తీర్చలేమని, ధైర్యంగా ఉండాలని బాధిత కుటుంబీకులకు సూచించారు. మృతుల కుటుంబ సభ్యులు ఇంటి పెద్దలను కోల్పోయామంటూ మంత్రి వద్ద కన్నీరుమున్నీరయ్యారు. కార్యక్రమంలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే బండారు శ్రావణి, ఎస్పీ జగదీష్, ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చుక్కలు

శింగనమల మండలం ఆకులేడు గ్రామానికి చెందిన రైతు మల్లికార్జున ఖాతా నంబరు 1691లోని భూమిని చుక్కల భూములుగా నమోదు చేశారని ఆవేదన చెందారు. ఆల్ ఇండియా రేడియోలో ఈ నెల 7వ తేదీన నిర్వహించిన 'అనంత మిత్ర ఫోన్ ఇన్' కార్యక్రమానికి ఫోన్ చేసి తన సమస్యను నేరుగా కలెక్టర్ వినోద్‌కుమార్‌కే చెప్పుకున్నారు. ఒక మల్లికార్జునకే కాదు... జిల్లాలో చాలా మంది రైతులు ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

- మంచి చేసేలా గత వైఎస్సార్ సీపీ సర్కారు చర్యలు
- కూటమి సర్కారు వచ్చీరాగానే బ్రేకులు
- ఫ్రీహోల్డ్ పరిశీలన పేరుతో అడ్డంకులు
- డీఎల్‌సీ సమావేశం నిర్వహించని అధికారులు
- 220 ఫైళ్లపై నిర్ణయం తీసుకోని అధికారులు
- కలెక్టర్‌కు తమ గోడు చెప్పుకుంటున్న రైతులు



అనంతపురం అర్బన్: రైతులకు కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. 'అన్నదాత సుఖీభవ' కింద ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేల పెట్టుబడి సాయం అందక ఇబ్బంది పడుతున్నారు. ఉచిత పంటల బీమాను ప్రభుత్వం రద్దు చేయడంతో రైతులు తమ ప్రీమియం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఇక 2023 ఏడాదికి సంబంధించి బీమా మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే తాజాగా మరో కష్టం వచ్చిపడింది. 'చుక్కల' తిప్పలు మళ్లీ మొదలయ్యాయి.

నిలిచిన 220 ఫైళ్లు..

డీఎల్‌సీ (జిల్లా స్థాయి కమిటీ) సమావేశం నిర్వహించకపోవడంతో 'చుక్కల' భూములకు సంబంధించి దాదాపు 220 అర్జీలు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. రైతులకు మంచి చేయాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2003 కంటే ముందు అస్సైన్డ్ అయిన భూములకు యాజమాన్య హక్కులు కల్పించేలా చరిత్రాత్మక నిర్ణయం తీసుకుని అమలు చేసింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం దీనిపై పరిశీలనకు ఆదేశించడంతో 22ఏ జాబితాలోని భూములు, చుక్కల భూములకు సంబంధించిన ఫైళ్ల పరిష్కారానికి బ్రేక్ పడింది. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

చుక్కల భూమి అంటే...

నిషేధిత భూములు (22ఏ), చుక్కల భూములు (డాటెడ్ ల్యాండ్) రెండు ఒకే రకం కాదు. వీటి మధ్య చాలా వ్యత్యాసం ఉంది. 1954, జూన్ 18 కంటే ముందు అస్సైన్ చేసిన ప్రభుత్వ భూములు 22ఏ భూముల జాబితా కిందకు వస్తాయి. ఇక చుక్కల భూములు విషయానికి ప్రభుత్వ భూమిగా చెప్పే భూమి వివరం ఆర్ఎస్ఆర్ (రీ సెటిల్మెంట్ రిజిస్టర్)లో చుక్కలుగా చూపించి ఉండాలి. ఆ భూమి ఎవరికీ అస్సైన్ చేసి ఉండకూడదు. ఇలాంటి భూమిని అనుభవించేవారు దరఖాస్తు చేసుకుంటే... నిబంధనల మేరకు ఉన్నవాటికి డీఎల్‌సీ సమావేశంలో నిర్ణయం తీసుకుని జాబితా నుంచి తొలగిస్తారు.

ఆమోదముద్రకు నిబంధనలిలా...

- చుక్కల భూముల జాబితాలో ఉన్న ప్రభుత్వ భూమినిని సాగు చేస్తున్న వారికి నిబంధనల ప్రకారం డీఎల్‌సీ ఆమోద ముద్ర వేస్తుంది.
- సాగు చేస్తున్న ప్రభుత్వ భూమి వివరం ఆర్ఎస్ఆర్‌లో 'చుక్కలు'గా ఉండాలి. ఆ భూమి ఎవరి పేరునా అస్సైన్ చేసి ఉండకూడదు.
- డాటెడ్ ల్యాండ్ చట్టం–2107 ప్రకారం ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న వ్యక్తి చట్టం వచ్చే నాటికి 12 ఏళ్ల ముందు ఆ భూమిపై హక్కు, అనుభవం కలిగి ఉండాలి.
- చట్టం నిబంధనల ప్రకారం సాగు చేస్తున్న వారు తహసీల్దారు వద్ద దరఖాస్తు చేసుకోవాలి. దీనిపై సమగ్ర విచారణ నిర్వహించి ఆర్‌డీఓకు తహసీల్దారు నివేదిస్తారు. దానిని ఆర్‌డీఓ విచారణ చేసి కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తారు.
- ఇక్కడ జిల్లాస్థాయి కమిటీ వాటిని విచారణ చేసి నిబంధనల ప్రకారం అన్ని సక్రమంగా ఉన్నవాటికి జాబితా నుంచి తొలగిస్తూ అమోద ముద్ర వేస్తారు.

త్వరలో చర్యలు చేపడతాం



అస్సైన్మెంట్ భూములకు సంబంధించి ఫ్రీహోల్డ్ పరిశీలన ప్రక్రియ పూర్తయ్యింది. ఫ్రీహోల్డ్ భూములు, చుక్కల భూములు, వాటి రిజిస్ట్రేషన్లు ఇలా ఒకదానితో ఒకదానికి సంబంధం ఉంది. ఈ కారణంగా డీఎల్‌సీ సమావేశం నిర్వహించలేదు. ఫ్రీహోల్డ్ పరిశీలన నివేదికను ప్రభుత్వానికి పంపిస్తాం. ఆటు తరువాత చుక్కల భూములకు సంబంధించి డీఎల్‌సీ సమావేశం నిర్వంచేందుకు త్వరలో చర్యలు చేపడతాం. – వి.వినోద్‌కుమార్, కలెక్టర్

క్లుప్తంగా

60 వేల హెక్టార్లకు 'రబీ'



పప్పుశనగ

అనంతపురం అగ్రికల్చర్: రబీలో సాధారణ సాగు 1,18,330 హెక్టార్లుగా వ్యవసాయాధికారులు గుర్తించగా... తాజా నివేదిక ప్రకారం 51 శాతం విస్తీర్ణంతో 60 వేల హెక్టార్లలో పంటలు సాగులోకి వచ్చాయి. ఇందులో ప్రధాన పంట పప్పుశనగ 72,909 హెక్టార్లకు గానూ 70 శాతంతో 50,776 హెక్టార్లలో సాగైంది. ఆలస్యంగా వేసిన పంట వివరాలు అందాల్సి ఉంది. ఈ లెక్కన పప్పుశనగ విస్తీర్ణం మరింత పెరగనున్నట్లు సమాచారం. ప్రస్తుతం నీటి వసతి కలిగిన ప్రాంతాల్లో వేరుశనగ, వరి నాట్లు వేస్తున్నందున ఈ రబీలో సాధారణ విస్తీర్ణంలో పంటలు సాగులోకి వచ్చే అవకాశముంది. వేరుశనగ సాగుకు డిసెంబర్ 15 వరకు అనువైన సమయంగా శాస్త్రవేత్తలు ప్రకటించారు.

27న విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు

అనంతపురం రూరల్: విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న మూగ, చెవిటి, శారీరక, మానసిక వికలాంగులు, అంధులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకుడు అబ్దుల్ రసూల్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 27న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో పోటీలు ఉంటాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన విభిన్న ప్రతిభావంతులు ఉదయం 9 గంటలకు హాజరై, పేర్లు నమోదు చేసుకోవాలి.


కుప్పకూలిన ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ పైకప్పు



పైకప్పు కూలిన దృశ్యం

అనంతపురం క్రైం: ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ పైకప్పులో ఓ భాగం కుప్పకూలింది. కాలం చెల్లిన భవనం కావడంతో రోజు వారీ పెచ్చులూడి పడుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున ఉన్నఫళంగా కొద్ది భాగం కుప్పకూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కూలిన ప్రాంతంలో కార్యాలయ ఉద్యోగులు తమ వాహనాలను పార్కింగ్ చేస్తుంటారు. ఇక కార్యాలయం అంతర్భాగంలోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. ఎప్పుడు కూలుతుందో తెలియని అయోమయ పరిస్థితిలో నెలకొనడంతో ఉద్యోగులు భయంభయంగానే విధులు నిర్వర్తిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోనే ఉన్న ఆర్ఎం కార్యాలయం పరిసరాల్లో నిత్యం రద్దీ ఉంటుంది. శిథిలావస్థకు చేరుకున్న కార్యాలయ చుట్టూ ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే జనం అటుగా వెళ్లే అవకాశం ఉండదని పలువురు సూచిస్తున్నారు.

పెయ్య దూడలకు వ్యాక్సిన్



పశువుల్లో బ్రూసెల్లోసిస్ వ్యాధి కారక వైరస్

అనంతపురం అగ్రికల్చర్: బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణలో భాగంగా 4 నుంచి 8 నెలల వయస్సున్న పెయ్య దూడల (ఆవు, గేదెలకు సంబంధించి)కు ఉచితంగా టీకాలు వేయనున్నారు. ఈ మేరకు పశుసంవర్ధకశాఖ రెండు జిల్లాల జేడీలు డాక్టర్ జీపీ వెంకటస్వామి, డాక్టర్ జి.శుభదాస్, పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం (ఏడీ డీఎల్) ఏడీ డాక్టర్ ఎస్.రామచంద్ర ఆదివారం తెలిపారు. ప్రస్తుతం అనంతపురం జిల్లా 6,750 డోసులు, శ్రీసత్యసాయి జిల్లాలో 6,050 డోసుల మందు అందుబాటులో ఉందన్నారు. ఈ ఏడాది ఇప్పటికే తొలి విడతగా 20,150 పెయ్యదూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలు ఉచితంగా వేసినట్లు తెలిపారు. రెండో విడతగా డిసెంబర్ 19 వరకు 13,800 పెయ్య దూడలను గుర్తించి వాటికి అవసరమైన వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. బ్రూసెల్లోసిస్ వ్యాధి సోకితే పశువుల్లో జ్వరం, బలహీనత,, చూడి కట్టిన పశువులు ఆఖరి దశలో అబార్షన్ కావడం, మాయ వేయకపోవడం, గర్భస్రావాలు, చూడి నిలబడకపోవడం, మగ పశువులలో వృషణాల వాపు, కీళ్ల వాపు, వ్యంధత్వం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వ్యాధి సోకిన పశువుల గర్భస్రావాలు, మాయ, పాల ద్వారా ఇతర పశువులుకు, అలాగే మనుషులకు కూడా వ్యాధి సోకే ప్రమాదముందన్నారు. వ్యాధి నివారణలో భాగంగా 4 నుంచి 8 నెలల వయస్సున్న దూడలకు ముందస్తుగా ఉచితంగా టీకాలు వేయించుకోవాలని రైతులకు సూచించారు. పాలను బాగా మరిగించి వాడుకోవాలన్నారు. వ్యాధిగ్రస్థ పశువు మిగిల్చిన మేత, పేడ, మాయ, గర్భస్రావం లాంటి వాటిని గుంత తవ్వి పూడ్చివేయాలని సూచించారు.

స్ఫూర్తిదాయకంగా ఉద్యోగుల క్రికెట్



టోర్నీని ప్రారంభిస్తున్న మాంఛో ఫెర్రర్

అనంతపురం: యువతలో స్ఫూర్తి రగిలించేలా ఐపీఎల్ తరహాలో ఉద్యోగుల క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ అన్నారు. ఏపీ వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్, ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫాదర్ ఫెర్రర్ ఉద్యోగస్తుల క్రికెట్ టోర్నీని ఆదివారం అనంతక్రీడాగ్రామంలో ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఉద్యోగులకు ఆటవిడుపుతో పాటు ఆరోగ్యానికి, మానసికోల్లాసానికి ఈ తరహా పోటీలు దోహదపడతాయన్నారు. అంతర్జాతీయ స్థాయి క్రికెటర్లను తయారు చేయడమే లక్ష్యంగా ఆర్డీటీ పనిచేస్తోందన్నారు. వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చేసిన సేవలకు గుర్తుగా ఏటా ఆయన జ్ఞాపకార్థం ఉద్యోగస్తులకు, జర్నలిస్టులకు క్రికెట్ టోర్నీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ టోర్నీలో 20 జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయన్నారు. బార్ కౌన్సిల్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది గురుప్రసాద్, అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి, జుడిషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీటీపీ నూతన అధ్యక్షుడిగా సీవీఆర్

- కార్యదర్శిగా రంగస్వామి



సీవీ రమణ



రంగస్వామి

అనంతపురం ఎడ్యుకేషన్: రిటైర్డ్ అధ్యాపకుల సంఘం (ఆర్‌సీటీపీ) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు. అంతకు ముందు రిటైర్డ్ అధ్యాపకుల సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీవీ రమణ, కార్యదర్శిగా ఎస్.రంగస్వామి, ఉపాధ్యక్షుడిగా ఎస్.చెన్నకేశవులు, ట్రెజరర్‌గా డి.అనంతరావు, ఈసీ సభ్యులుగా వై.రామకృష్ణారెడ్డి, టి.వన్నూరప్ప, జి.హేమచంద్రన్, వై.రాజేంద్రప్రసాద్, డి.వరలక్ష్మి, ఎస్.ఇంతియాజ్ అహమ్మద్, ఆర్.వేణుగోపాల్ శెట్టి, జి.వెంకటరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రిటైర్డ్ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా ప్రభుత్వంపై చర్చించి కమిటేషన్ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

- అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేష్‌బాబు



మాట్లాడుతున్న సురేష్‌బాబు

అనంతపురం అర్బన్: రాష్ట్రంలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనం పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ కూటమి సర్కార్‌ను అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్‌బాబు, అమరావతి జేఏసీ జిల్లా చైర్మన్ ఆర్.ఎస్.దివాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ఖాన్ డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురంలోని రెవెన్యూ ఉద్యోగుల సంఘం భవన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. చాలీచాలని వేతనం అందుకుంటున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. జీఓ 30, జీవో 7ను సవరించి న్యాయబద్ధంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలన్నారు. ఏళ్లగా ప్రభుత్వ శాఖల్లో తక్కువ వేతనానికి పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సీనియారిటీ ప్రాతిపదికన ఏటా ఎంతో కొంత ఇంక్రిమెంట్ రూపంలో ఇవ్వాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనం నుంచి ప్రతి నెలా ఈఎస్ఐ కింద డబ్బులు చెల్లిస్తున్నా సరైన వైద్యం అందడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈఎస్ఐ, ఎంపానల్డ్ ఆస్పత్రుల యాజమాన్యంతో మాట్లాడి సరైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు రామకృష్ణ, గంగాద్రి, ప్రధాన కార్యదర్శులు రాఘవేంద్ర, రమేష్‌నాయక్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

కంబదూరు: మండలంలోని కదిరిదేవరపల్లిలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. తాళం బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు సుమారు రూ.2 లక్షలు విలువ చేసే 9 వెండి గొడుగులు, 3 వెండి నాగ పడగలు, 6 వెండి కిరీటాలు, బంగారు తాళిబొట్టు గిన్నెలు, రూ.3 వేల నగదు అపహరించారు. ఆదివారం ఉదయం ఆలయంలో పూజాదికాలు చేసేందుకు వెళ్లిన అర్చకులు గమనించి సమాచారం ఇవ్వడంతో ఈఓ దేవదాసు, డీఎస్పీ రవిబాబు, సీఐ నీలకంఠేశ్వర, ఇన్‌చార్జ్ ఎస్ఐ రాంభూపాల్ తదితరులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

చిన్నముష్టూరులో దొంగతనం

ఉరవకొండ: మండలంలోని చిన్నముష్టూరులో దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన రైతు సాంబశివ, చౌడమ్మ దంపతులు ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లారు. రాత్రి ఇంటికి చేరుకున్న వారు అప్పటికే తాళం బద్ధలుగొట్టి ఉండడం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించారు. బీరువాలో భద్రపరిచిన 10 తులాల బంగారు నగలు, రూ.60వేలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం సాయంతో నిందితుల వేలిముద్రలను సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గుత్తిలో తుపాకీ కలకలం



జెడ్.వీరారెడ్డి కాలనీలో దొరికిన పిస్టల్

గుత్తి: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని జెడ్.వీరారెడ్డి కాలనీలో ఆదివారం గన్ కలకలం రేపింది. కాలనీలో ఓ ఇంటి పక్కన పడి ఉన్న గన్ (పిస్టల్)ను స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, స్వాధీనం చేసుకున్నారు. పిస్టల్ పురాతనమైందని, అందులో బుల్లెట్లు ఏమీ లేవని పోలీసులు తెలిపారు. పిస్టల్ ఎవరిదనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్తగా మన ఊళ్లో గన్ కల్చర్ ఏమిటంటూ గుత్తి వాసులు చర్చించుకోవడం గమనార్హం.

కర్ణాటకలో ప్రమాదం... ఉరవకొండ వాసి మృతి



రామేశ్వరరెడ్డి (ఫైల్)

ఉరవకొండ: కర్ణాటకలోని బెంగళూరులో చోటు చేసుకున్న ప్రమాదంలో ఉరవకొండకు చెందిన ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. వివరాలు... ఉరవకొండకు చెందిన సంజీవరెడ్డి కుమారుడు రామేశ్వరరెడ్డి (19) బెంగళూరులోని దయానంద సాగర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం తన స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని ఆటోలో తిరిగి వెళుతుండగా హోరువల్లి కనకపుర రోడ్డు సమీపంలో బస్సు ఢీకొంది. ప్రమాదంలో రామేశ్వరరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. అదే ఆటోలో ప్రయాణిస్తున్న స్నేహితులు తీవ్రంగా గాయపడ్డారు. ఉన్నత చదువులు అభ్యసించి జీవితంలో స్థిరపడుతాడనుకున్న కుమారుడు దుర్మరణం పాలవ్వడంతో తల్లిదండ్రుల వేదనకు అంతులేకుండా పోయింది.

ద్విచక్రవాహనాలు ఢీ - వృద్ధుడి మృతి

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీనివాసక్యాంప్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు.. దేవగిరి క్రాస్‌కు చెందిన కొండయ్య (75) ఆదివారం శ్రీనివాసక్యాంపు సమీపంలో పొలం పనులు చూసుకుని తన సూపర్ ఎక్స్‌ఎల్ వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. అదే సమయంలో బెంగళూరు నుంచి మంత్రాలయానికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న గోవర్ధన్ అనే వ్యక్తి ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన కొండయ్యను బళ్లారిలోని విమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన గోవర్ధన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

క్వారీలో తేనెటీగల దాడి

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల సమీపంలోని ఓ క్వారీలో తేనెటీగలు దాడి చేయడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకోగా గాయపడిన మస్తాన్, రామాంజినేయులును వెంటనే కొనకొండ్ల పీహెచ్‌సీలో చికిత్సలు అందజేసి, గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న మస్తాన్‌ను ఆదివారం ఉదయం అనంతపురానికి రెఫర్ చేశారు.

నెలాఖరులోపు డీలర్లకు సరుకులు : డీఎస్ఓ



శింగనమల స్టాక్ పాయింట్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్ఓ వెంకటేశ్వర్లు

శింగనమల: జిల్లాలోని అన్ని చౌకధాన్యపు డిపోల డీలర్లకు నెలాఖరులోపు నిత్యావసర సరుకులు అందజేస్తామని డీఎస్ఓ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం శింగనమలలోని సివిల్ సప్లయి స్టాక్ పాయింట్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టాక్ పాయింట్ నుంచి శింగనమల, గార్లదిన్నె, నార్పల, బుక్కరాయసముద్రం మండలాల్లోని 136 చౌకధాన్యపు డిపోలకు ఇప్పటి వరకూ 60 శాతం నిత్యావసర సరుకులు సరఫరా చేశారు. వీటికి సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. 1వ తేదీ నుంచి రేషన్ పంపిణీకి ఎలాంటి ఇబ్బంది లేకుండా నెలాఖరులోపే డీలర్లందరికీ సరుకులు చేరవేస్తామన్నారు.

యువకుడి దుర్మరణం



ప్రభాకరనాయుడు (ఫైల్)

పుట్లూరు: ఎద్దులబండిని ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... యల్లనూరు మండలం కూచివారిపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్ నాయుడు (36), వెంకటేష్ ఆదివారం ద్విచక్ర వాహనంపై తాడిపత్రికి బయలుదేరారు. నారాయణరెడ్డిపల్లి సమీపంలోకి చేరుకోగానే పొలాల వైపు నుంచి రోడ్డుపైకి ఉన్నఫళంగా వచ్చిన ఎద్దులబండిని నేరుగా వెళ్లి ఢీకొనడంతో ప్రభాకర్ నాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేష్‌ను తొలుత తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తర్వాత అనంతపురంలోని ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. కాగా, ప్రభాకరనాయుడుకు భార్య సాయిలత, మూడేళ్ల వయసున్న కుమార్తె, తొమ్మిది నెలల వయసున్న బాబు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

శింగనమల: మండలంలోని రాచేపల్లి గ్రామ సమీపంలో శిబిరం ఏర్పాటు చేసుకుని పేకాట ఆడుతున్న 25 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో అనంతపురం, వైఎస్సార్ జిల్లాకు చెందిన ప్రముఖులు ఉండడం గమనార్హం. రాచేపల్లి వద్ద పెద్ద ఎత్తున పేకాట జరుగుతోందన్న సమాచారంతో అప్రమత్తమైన అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రూ.13,18,560 నగదుతో పాటు 20 సెల్‌ఫోన్లు, 4 బైకులు, 2 కార్లు స్వాధీనం చేసుకున్నారు. జూదరులను న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్య వైశ్యులకు అండగా ఉంటా



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్



ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన శబరి వరప్రసాద్‌ను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ కోగటం

- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్

అనంతపురం టవర్‌క్లాక్: ఆర్య వైశ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం స్థానిక కేటీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య యువజన సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం, అభినందన సభ జరిగింది. కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్‌తో పాటు వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంఎస్ రాజు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూపకుంట్ల శబరి వరప్రసాద్‌తో పాటు నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మంత్రి భరత్ మాట్లాడుతూ... ఆర్యవైశ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా తన దృష్టికి తీసుకు వస్తే సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటానన్నారు. ఆర్య వైశ్య సత్రం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. పరిశ్రమల నెలకొల్పేందుకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ... ఏ రాజకీయ పార్టీకి ప్రాధాన్యతనివ్వకుండా అందరినీ కలుపుకుని ముందుకు సాగడం ఆర్యవైశ్యుల విధేయతకు నిదర్శనమన్నారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, ఆర్య వైశ్య ప్రముఖులు సుబ్బరాయుడు, షణ్ముఖరావు, సిరిగుప్ప వెంకటేష్, విష్ణుతేజ, వంకదారు జయలక్ష్మి, అనిల్ కుమార్, సుజన్‌కుమార్, మిట్టా వంశీకృష్ణ, వెంకటకృష్ణ, కలవల సతీష్, ముడియం రమణ, గ్రంధి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పంపనూరు.. భక్తజన హోరు





ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు, ఆలయ ప్రాంగణంలో వెలిగిస్తున్న దీపాలు

ఆత్మకూరు: ఉమ్మడి జిల్లాలోనే ప్రఖ్యాతి గాంచిన ఆత్మకూరు మండలం పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి క్షేత్రం ఆదివారం భక్త జనసంద్రమైంది. కార్తీక మాసం కావడంతో స్వామి దర్శనం కోసం ఉమ్మడి జిలా నుంచే కాక పొరుగున ఉన్న కర్ణాటక నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు పెద్ద ఎత్తున సాగాయి. పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో మూలవిరాట్‌ను అలంకరించారు. కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు నిర్వహించారు. నిమ్మదొప్పులు, మట్టి ప్రమీదల్లో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



స్వామి దర్శనానికి బారులు తీరిన దృశ్యం

క్లుప్తంగా

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ఆత్మకూరు బైపాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆత్మకూరు: వాహనాల్లో ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించుకోవద్దని ఏఎస్‌ఐ దస్తగిరి వాహనదారులకు సూచించారు. ఆదివారం ఆత్మకూరు బైపాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న వారికి జరిమానా విధించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. రెండు రోజుల క్రితం గార్లదిన్నె వద్ద ఇలా ప్రమాదం జరిగి ఎనిమిది మంది మరణించారని గుర్తు చేశారు. ద్విచక్ర వాహనాలు నడిపే వ్యక్తులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరగనుంది. నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ తదితర విభాగాలకు చెందిన సెక్షన్స్ హెడ్స్ స్పందనలో అందుబాటులో ఉంటారు. నగర ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని నగరపాలక సంస్థ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

ఫిర్యాదుల విభాగానికి హాజరుకండి

రాప్తాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల అధికారుల హాజరు కావాలని తహసీల్దార్ విజయకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అర్జీదారులు కార్యాలయానికి వచ్చినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.


ఓటరు నమోదుపై అవగాహన కల్పించండి



మరూరులో బీఎల్వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్ విజయ కుమారి

రాప్తాడు: బూత్ లెవల్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ పి.విజయ కుమారి సూచించారు. ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని 16 పంచాయతీ గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణల కార్యక్రమాన్ని చేపట్టారు. హంపాపురం, గొల్లపల్లి, మరూరు గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదును తహసీల్దార్ విజయ కుమారి పర్యవేక్షించారు. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పుల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయని బూత్‌లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓ)తో ఆరా తీశారు. ఓటరు జాబితాలో తప్పులను సరిచేసి ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈడీటీ సువర్ణ, ఆర్‌ఐ కరుణాకర్, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన దృశ్యం

అనంతపురం టవర్‌క్లాక్: నాయీబ్రాహ్మణులు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పిల్లలను బాగా చదివించాలని డీఎస్పీ ఉపేంద్ర బాబు సూచించారు. ఆదివారం స్థానిక జయమణెమ్మ కళ్యాణ మంటపంలో నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విద్య ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. విద్యార్థి దశ నుంచి ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకోవాలన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివితే ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. విద్యతో పాటు సామాజిక సేవ చేయడం కూడా అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకట రంగయ్య, ఆర్టీసీ శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, పీవీ రమణయ్య, ఉమామహేశ్వరి, బాలతాత, దేవ ప్రసాద్ రావు, ఏడుకొండలు, దివాకర్, వివేకనంద స్వామి, శేఖర్ బాబు, ఆదినారాయణ, కొండన్న, శ్రీనివాసులు, ఎల్లనూరు ప్రసాద్, రమేష్, రామాంజనేయులు, శివ ప్రసాద్, అనిమేష్ బాబు, శివ శంకర్, నాగరాజు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తూ.. ఆదర్శంగా నిలుస్తూ



- అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మాలధారులకు భోజన వసతి
- దాతల సహకారంతో ఏటా కొనసాగింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న మాలధారులు

రాప్తాడు: కోరిక కోర్కెలు నెరవేరాయని కొందరు.. ఆధ్యాత్మిక జీవితం గడిపేందుకు మరొకొందరు మాలధారణ చేస్తున్నారు. అయ్యప్ప, వేంకటేశ్వర స్వామి, ఆంజనేయ స్వామి, భవానీ, శివమాల స్వీకరించి, నియమ నిష్ఠలతో ఉంటారు. వివిధ పనుల నిమిత్తం రోజూ మండల కేంద్రానికి వస్తుంటారు. భిక్ష కోసం ఇబ్బందులు పడుతుంటారు. అటువంటి మాలధారులు భిక్ష కోసం ఇబ్బందులు పడకుండా రాప్తాడులోని అయ్యప్ప సేవా సమితి ఉచితంగా అన్నదానం చేస్తోంది. రోజూ మధ్యాహ్నం, రాత్రి 100 నుంచి 200 మంది మాలధారులు ఇక్కడికి వచ్చి భిక్ష స్వీకరిస్తున్నారు. రాప్తాడుకు చెందిన అయ్యప్ప



భిక్ష స్వీకరిస్తున్న అయ్యప్ప భక్తులు

స్వామి భక్తులు 2012లో అయ్యప్ప సేవా సమితి ఏర్పాటు చేశారు. వివిధ పనుల నిమిత్తం దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు భిక్ష కోసం పడుతున్న ఇబ్బందులను గుర్తించారు. స్థానిక అభయాంజనేయ స్వామి, అయ్యప్ప స్వామి ఆలయం దగ్గర అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో పన్నెండేళ్లుగా అన్నదానం చేస్తున్నారు. దాతల సాయంతో ఇన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమం కొనసాగిస్తూ వస్తున్నారు. 2020 కోవిడ్ వల్ల ఆపినా.. తరువాత సంవత్సరం నుంచి ఏటా మండలం రోజులు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది నవంబర్ 18న ఉచిత భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం వచ్చే ఏడాది జనవరి 9 వరకు కొనసాగుతుంది. అయ్యప్ప సేవా సమితిలో సభ్యులైన పామాల లింగమయ్య అలియాస్ దాబా లింగమయ్య, మాజీ కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దండు రామాంజనేయులు, దండు శంకర్, బులగొండ బీరన్న ఆధ్వర్యంలో వంట చేయడానికి ప్రత్యేకంగా వంట మనుషులను నియమించారు. మాలధారులకు రుచికరంగా భిక్షను సిద్ధం చేయిస్తున్నారు. వివిధ గ్రామాలకు చెందిన దాతలు నగదుతో పాటు బియ్యం, కూరగాయలు, పెరుగు, అరటి ఆకులను విరాళంగా అందిస్తున్నారు. ఒక రోజు అన్నదానానికి సుమారు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ ఖర్చు అవుతున్నట్లు సభ్యులు చెబుతున్నారు.

12 ఏళ్ల నుంచి సేవలు



అయ్యప్ప, శివమాలధారణ భక్తులు రోజు రోజుకూ పెరుగుతున్నారు. మాల ధరించినప్పటి నుంచి భక్తిశ్రద్ధలతో 41 రోజులు కఠిన దీక్ష ఉండి ఇరుముడిని కట్టుకుని పంబా నదిలో స్నానం చేస్తే చేసిన పాపాలు తొలగిపోతాయని నమ్మకం. మాల ధరించడంతో ఎంతో మంది మత్తు పదార్థాలు, వ్యసనాల నుంచి దూరమై ఆధ్యాత్మిక చింతనతో గడుపుతున్నారు. దాతల సహకారంతో 12 ఏళ్ల నుంచి ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్నాం.

– పామాల లింగమయ్య, గురుస్వామి, రాప్తాడు

ఆరేళ్ల నుంచి ఇక్కడే భిక్ష



బోర్‌వెల్ బండికి కూలీగా వెళ్తున్నాను. 11 ఏళ్లుగా మాల వేస్తున్నాను. బోర్‌వెల్ బండి రాప్తాడు పరిసర ప్రాంతాలకు వచ్చిందంటే రాప్తాడులోని అయ్యప్ప ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కేంద్రానికి వచ్చి అన్న ప్రసాదం స్వీకరిస్తున్నాను. ఆరేళ్ల నుంచి ఇక్కడే భిక్ష చేస్తున్నాను. నాతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చే స్వాములు ఇక్కడే భోజనం చేస్తారు. కమిటీ సభ్యులు నాణ్యమైన భోజనాన్ని మాలధారులకు అందిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే స్వాములకు ఇదొక వరంగా మారింది. ఇటీవల కాలంలో రోజూ హైదరాబాద్ నుంచి పాదయాత్ర స్వాములు పదుల సంఖ్యలో వచ్చి ఇక్కడే భిక్ష చేసి వెళ్తుంటారు. ఎంత మంది మాలధారులు వచ్చినా లేదు అనకుండా భోజన వసతి కల్పించడం హర్షణీయం.

–సుధాకర్, గోళ్ల, కళ్యాణదుర్గం మండలం

దాతల సహకారంతో అన్నదానం



దాతల సహకారంతో అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద 1999లో అయ్యప్ప ఆలయాన్ని నిర్మించాం. గత 12 ఏళ్లుగా మాలధారణ స్వీకరించిన భక్తులకు భిక్ష అందజేస్తున్నాం. అయ్యప్ప, శివస్వామి సేవలో 41 రోజులు మండల దీక్ష స్వీకరించిన స్వాములకు ఉపయోగకంగా ఉంటోంది.

– దండు శంకర్, రాప్తాడు

కళారూపాలను కాపాడుకుందాం



ప్రశంసాపత్రాలను చూపుతున్న విద్యార్థులు

అనంతపురం కల్చరల్: జిల్లా చరిత్రను, ప్రాచీన కట్టడాలను, కళారూపాలను పరిరక్షించుకునేందుకు యువతరం ముందుకు రావాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి కమతం జయకుమార్ బాబు పిలుపునిచ్చారు. వారం రోజులుగా అనంత చరిత్ర, సంస్కృతిపై అవగాహన పెంచుతూ సాగిన ప్రపంచ వారసత్వ వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. స్థానిక సాయి బాబా కళాశాలలో జరిగిన ముగింపు సమావేశంలో పలువురు వక్తలు, అధికారులు మాట్లాడారు. విద్యార్థులు మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పర్యాటక కేంద్రాల విశిష్టతను తెలుసుకోవాలని సూచించారు. మనం నివసించే అనంత పట్టణం ఎలా ఏర్పండిందన్న విషయాన్ని ఆసక్తికరంగా తెలియజేశారు. అలాగే ఇంటాక్ ప్రతినిధులు సాధుశేఖర్ జానపద గేయాలను, రియాజుద్దీన్ శతక పద్యాలను, జూటూరు షరీఫ్ తెలుగు నాటకాల్లోని పద్యాలను రాగయుక్తంగా ఆలపించారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. అలాగే న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన లంకా రమణ, ఒంటెద్దు రామలింగారెడ్డి, రామాంజనేయులును సత్కరించారు. కార్యక్రమంలో మ్యూజియం శాఖ ఏడీ రజిత, ఇంటాక్ కన్వీనర్ రాంకుమార్, కో–కన్వీనర్ పిడతల కృష్ణమూర్తి, జీవిత సభ్యులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నబీరసూల్, సూర్య నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, రైతు వ్యతిరేక పాలనపై ఉద్యమం



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు, పాలనపై ఐద్య ఉద్యమాల ద్వారా పోరాటాలు ఉధృతం చేస్తామని ఆ సంఘాల నాయకులు అన్నారు. ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం నాయకులు, కార్యకర్తలు నగరంలో పెద్ద ఎత్తున బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐకే ఎంఎస్, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు రాజారెడ్డి, రాజేష్‌గౌడ్, వెంకటనారాయణ, ఏసురత్నం, కృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, బాలరంగయ్య మాట్లాడారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు ప్రభుత్వాలు పని చేస్తూ రైతు, కార్మికులకు ద్రోహం చేస్తున్నాయన్నారు. కార్మికులు పోరాడి, త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న మహాధర్నాలో రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు చిరంజీవి, కృష్ణుడు, శ్రీనివాసులు, మల్లికార్జున, రామాంజనేయులు, వీరేంద్ర, చంద్ర పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేయాల్సిందే



రాష్ట్ర మహాసభల పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: నిరుద్యోగ యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుద్యోగులు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ప్రభుత్వం కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో ఫిబ్రవరి 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ శ్రీకాకుళంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు. సమగ్ర యువజన విధానం, భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు చేయాలన్నారు. పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించాలని కోరారు. డీఎస్సీ నోటిఫికేషన్‌తో పాటు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటికేషన్ విడుదల చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకోలన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌కృష్ణ, కాత్రేష్, శామ్యూల్, దేవేంద్ర, కుమార్‌నాయక్, శ్రీనివాస్, అశోక్, సురేంద్ర, ఉదయ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శతాధిక కవి సమ్మేళనం



కవులను సత్కరిస్తున్న లేపాక్షి ఫౌండేషన్ నిర్వాహకులు

అనంతపురం/అనంతపురం కల్చరల్: అనంత వేదికగా మరోసారి జాతీయస్థాయి శతాధిక కవి సమ్మేళనం ఘనంగా జరిగింది. లేపాక్షి ఫౌండేషన్ సంస్థ ఆవిర్భావం సందర్భంగా స్థానిక గ్రంథాలయ కళాప్రాంగణంలో జరిగిన కవి సమ్మేళనానికి విజయవాడ, తిరుపతి, కర్నూలు, విజయనగరం, శ్రీకాకుళం, తిరుపతితో పాటూ పక్క రాష్ట్రాలలోని పలు ప్రాంతాల నుంచి కవులు విచ్చేశారు. సామాజిక సమస్యలపై తమ గళాన్ని వినిపించి ఆకట్టుకున్నారు. లేపాక్షి ఫౌండేషన్ అధ్యక్షుడు వడ్డీ సుధాకర్ నేతృత్వంలో జరిగిన ఉద్ఘాటన కార్యక్రమానికి తెలుగు రక్షణ వేదిక జాతీయ అధ్యక్షుడు పొట్లూరు హరికృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడారు. అనంత సాహిత్యంలో యువత పాత్ర అమోఘమని.. గతంలో కూడా ప్రపంచ రికార్డు స్థాయి కవిత్వంలో ఎంతో మంది అనంత కవులు, సాహితీవేత్తలు రాష్ట్రానికే తలమానికంగా నిలిచారన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ యువతను అభినందించి తమ వంతు సహకారమందిస్తామని తెలియజేశారు. లేపాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రచురించిన స్వగతాలు బాలల గేయాల పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం కవులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో లేపాక్షి ఫౌండేషన్ నిర్వాహకులు గంధం అశోక్‌కుమార్, శ్రీనివాసులు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను సందర్శించిన జిల్లా జడ్జి



బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాశస్త్యం గురించి తెలుసుకుంటున్న జడ్జి ఎం.శ్రీనివాసులు

తాడిపత్రి అర్బన్: తాడిపత్రిలోని ప్రాచీన ఆలయాలైన బుగ్గరామలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణస్వామి ఆలయాలను ఆదివారం ఉమ్మడి అనంత జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.శ్రీనివాసులు కుటుంబ సమేతంగా సందర్శించారు. తొలుత ఆయన స్థానిక బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం జడ్జి గర్భాలయంలోని మూలవిరాట్ బుగ్గ రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి చింతల వెంకటరమణస్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంజీవనగర్‌లోని వేదగాయత్రీదేవిని దర్శించుకుని, ఐదో రోడ్డులో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఆశీర్వచనం చేసి స్వామి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేసి, జడ్జిని శాలువాతో సత్కరించారు. జిల్లా న్యాయమూర్తి వెంట సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.వెంకట సుబ్బరాయుడు, న్యాయవాదులు హనీఫ్, శివరామకృష్ణ, స్థానిక కోర్టు సిబ్బంది ఉన్నారు.

వరిగడ్డికి డిమాండ్



రోడ్డుకు ఇరువైపులా ఉన్న వరిగడ్డి ట్రాక్టర్లు

ఆత్మకూరు: మండలంలో వరిగడ్డికి డిమాండ్ పెరిగింది. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల నుంచి పెద్ద ఎత్తున ట్రాక్టర్లలో వరిగడ్డిని విక్రయించేందుకు ఆత్మకూరుకు వస్తున్నారు. ఒక ట్రాక్టర్ వరిగడ్డి రూ.7 వేల నుంచి రూ.9 వేల వరకు ధర పలుకుతోందని రైతులు చెబుతున్నారు. అయితే ట్రాక్టర్లను రోడ్డుకు ఇరువైపులా ఆపడంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం లేకపోలేదు. రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వరిగడ్డి ట్రాక్టర్లు రోడ్డు పక్కన ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న అంతే సంగతులు. ట్రాక్టర్లను దూరంగా ఆపాలని స్థానికులు కోరుతున్నారు.

టీటీ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో టీటీ సంఘం ప్రతినిధులు

అనంతపురం: కాకినాడలో డిసెంబర్ 22 నుంచి 25 వరకు జరిగే రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులను ఆదివారం ఎంపిక చేశారు. అండర్–15 బాలురు జట్టుకు అఖిల్, ఆప్రిత్, అస్లాం, ఆదిత్య, మోక్షజ్ఞ, గౌతమ్ ఎంపికయ్యారు. బాలికల జట్టులో జ్ఞాపిక, ఈషాసంజన, ఆర్.హాసిని, సుబహాన, మనస్విని, మోక్షిత, పురుషుల జట్టులో సి.కుషాల్‌కుమార్, గూడురు సాయిష్, సాజిద్, పవన్, ఎస్.ఎ.ఎ.రజన్, టి.వంశీకృష్ణ, ఎస్.రాజశేఖర్, మహిళల జట్టులో ఈషాసంజన, ఆర్.హాసిని, జీఎం.సులాస్య, ఎస్. సుభానా అక్తర్, పి.జ్ఞాపిక, మనస్విని, మోక్షిత చోటు దక్కించుకున్నారు. అనంతపురం క్లబ్‌లో నిర్వహించిన ఈ ప్రక్రియను జిల్లా టేబుల్ టెన్నిస్ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, చీఫ్ అడ్వైజర్ బి.మురళీధర్‌రావు, ఈసీ మెంబర్లు కిశోర్, అగిశం రంగనాథ్ తదితరులు పర్యవేక్షించారు.

ఇంజినీర్ల ఇష్టారాజ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో ఇంజినీర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహించేలా నోటిఫికేషన్ విడుదల చేయడం చర్చనీయాంశమైంది. వాస్తవంగా క్వాలిటీ కంట్రోల్ నివేదిక టెండర్‌కు సంబంధించి ఈ ఏడాది సెప్టెంబర్ 2న టెండర్ బిడ్ ప్రారంభమైంది. అదే నెల 17న బిడ్‌కు చివరి తేదీ. అదే రోజున టెండర్‌ను ఓపెన్ చేయాల్సి ఉంది. కాగా అధికారులు కాలయాపన చేసి, టెండర్‌ను జాప్యం చేసి, చివరకు పలు కారణాలను చూపి టెండర్‌ను రద్దు చేశారు. వాస్తవంగా అప్పట్లో ముగ్గురు టెండర్ దాఖలు చేశారు. వారిలో ఇంజినీర్లకు అనుకూలంగా ఉండే కాంట్రాక్టర్‌కు అనుభవంతో పాటు ల్యాబ్ అందుబాటులో లేదు. దీంతో ఎలాగైనా ఇంజినీర్లకు అనుకూలంగా ఉండే వారికి కాంట్రాక్ట్ దక్కేలా చేసేందుకు టెండర్‌లో నిబంధలను సడలిస్తూ.. రెండో సారి టెండర్లను పిలిచారు. ఈ నెల 19న బిడ్ ప్రారంభించారు. బిడ్‌కు ఈ నెల 26వ తేదీ చివరి అవకాశం. ఈ నెల 27న బిడ్‌ను ఓపెన్ చేస్తారు.ఈ అంశంపై నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజును సంప్రదించగా.. టెండర్లలో అక్రమాలకు ఆస్కారం ఇవ్వకుండా ఉండేందుకు రెండోసారి ఈ ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్లను ఆహ్వానించామన్నారు. నిబంధనల సడలింపులపై ఇంజినీర్లతో మాట్లాడతానని పేర్కొన్నారు.

త్యాగధనుడు ‘ఉయ్యాలవాడ’



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాప్తాడు రూరల్: ప్రజల కోసం ప్రాణాలర్పించిన గొప్ప త్యాగధనుడు, పాలేగాళ్ల వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని వక్తలు కొనియాడారు. ఉయ్యాలవాడ జయంతిని పురస్కరించుకుని ఆదివారం రాయలసీమ రెడ్డి జనసంఘం ఆధ్వర్యంలో నగరంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలోని ఉయ్యాలవాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్డి జనసంఘం నాయకులు మాట్లాడుతూ.. బ్రిటీష్ వారిని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తొలిసారిగా గడగడలాడించారని కొనియాడారు. నరసింహారెడ్డి పోరాటాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయలసీమ రెడ్డి జనసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రొద్దం సురేష్‌రెడ్డి, ట్రెజరర్ తోపుదుర్తి రామకృష్ణారెడ్డి, సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, జూటూరు శ్రీనాథ్‌రెడ్డి, పోతిరెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, రమణారెడ్డి, తగరకుంట నాగిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను ఆదివారం అనంతపురంలోని అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. అండర్–14 బాలికల విభాగంలో ఎ.స్మిత (22 కేజీలు), కావ్య (24 కేజీలు), సాత్విరెడ్డి (26 కేజీలు), తేజశ్రీ (30 కేజీలు), దివ్య సాయి (38 కేజీలు), దీక్ష (42 కేజీలు), లక్ష్మి (46 కేజీలు), రిష్మిత (50 కేజీలు) ఎంపికయ్యారు. అండర్–17 విభాగంలో ఇందుమతి, జయశ్రీ, సాయి అక్షిత, లీలాంజలి, తీర్థి, భాగ్యలక్ష్మి, దీపిక, వసుధ, సింధూజ, సాకియా, నందిని చోటు దక్కించుకున్నారు. ఈ ప్రక్రియను అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రారంభించగా జిల్లా ఎస్జీఎఫ్ సెక్రెటరీ సుగుణమ్మ, పీడీలు నాగరాజు, అబ్జర్వర్ దేవకీ పర్యవేక్షించారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం

రాప్తాడు: మౌనగిరి క్షేత్రంలోని 39 అడుగుల ఏకశిల అభయాంజనేయ స్వామి ఆలయంలో నిర్వాహకుడు ఈశ్వరయ్య స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలయ వార్షికోత్సవం వైభవంగా ముగిసింది. దాదాపు 1,000 కేజీల పూలను తీసుకువచ్చి భక్తులతో పుష్పాభిషేకం చేయించారు. ఆలయంలో ఉదయం గోపూజ, మహాగణపతి పూజా, రుద్రాభిషేకం, మహా మంగళహారతి, రాత్రి సీతారామ భజన నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన స్వరనీరాజనం



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గాయకులు

అనంతపురం కల్చరల్: తెలుగు చలనచిత్రసీమకు ఎనలేని సేవలందించి జాతీయస్థాయి కీర్తి సంపాదించిన ఎన్టీఆర్ వంటి మహానటుడు మళ్లీ పుట్టరని పలువురు వక్తలు కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు చలనచిత్ర రంగంలో మనదేశం సినిమాతో ప్రవేశించి 75 ఏళ్లు దాటిన సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా కళాకారులు ఆదివారం సంబరాలు నిర్వహించారు. స్థానిక లలిత కళాపరిషత్తు వేదికగా జరిగిన ఎన్టీఆర్ చలనచిత్ర స్వరనీరాజనోత్సవంలో ఘంటసాల ఆరాధన సమితి గౌరవాధ్యక్షుడు పాలసముద్రం నాగరాజు, జీవీ రామయ్య, ఆచార్య సుధాకరబాబు, ఉపాధ్యాయ కళాకారుడు బాలమురళీ తదితరులు మాట్లాడారు. జ్యోతి, విజయలక్ష్మి, బృంద, రామాంజి, లక్ష్మీనారాయణ తదితర గాయనీగాయకులు ఎన్టీఆర్ గీతాలను ఆలపించారు. పాటల మధ్యలో ఆ తరం విశేషాలను వివరించిన తీరు ఆకట్టుకుంది.